క్లుప్తంగా

బానిస బతుకులకు విముక్తి కల్పించిన మహనీయులు

నిజాంపేట(మెదక్): మహనీయులు దళిత, బహుజనులను బానిస బతుకుల నుంచి విముక్తి కల్పించారని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. నిజాంపేటలో శనివారం మహనీయుల జయంత్యోత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మహనీయుల త్యాగాలతోనే దళితుల బతుకుల్లో వెలుగులు నిండాయని, మహనీయులతోనే మన హక్కులు అమలులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గర్గుల శ్రీనివాస్, మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడు ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు రాజు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని, వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ మండలాధ్యక్షుడు పాగుల రాజు డిమాండ్ చేశారు. శనివారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ యూనివర్సిటీ భూములను కొల్లగొడుతుంటే, పేద బడుగు వర్గాలకు అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని ప్రశ్నించే దమ్ములేదుకాని బీజేపీ అగ్రనాయకులపై అవాకులు చేవాకులు పేలుతున్నారన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ నోరు అదుపులో పెట్టుకోవాలని లేదా బీజేపీ కార్యకర్తల ఆగ్రహానికి గురుకావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అశోక్, దశరథం, రాజు, రవి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ దామోదర్ కోరారు. శనివారం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయ అనుబంధమైన పనులను ఎంపిక చేసి, ప్రతీ గ్రామంలో కనీసం వంద మంది కూలీలకు పని కల్పించాలని సూచించారు. పొలం బాటలు, ఫిష్‌ఫండ్స్, నీటికుంటల పనులను ఎంపిక చేసి, నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజ్‌కుమార్, టీఏ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను నిలదీసిన గ్రామస్తులు

నర్సాపూర్: పాఠశాలలో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులు పాఠశాల హెడ్మాష్టరును నిలదీశారు. మండలంలోని కాగజ్‌మద్దూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిర్లక్ష్యంతో పాఠశాల నిర్వహణ అధ్వానంగా ఉందని గ్రామ మాజీ సర్పంచ్‌లు శంకరయ్య, శివకుమార్ తదితరులు శనివారం పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం నజియా తబస్సుంను నిలదీశారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలలో నీళ్లు లేనందున రెండు రోజులుగా విద్యార్థినులు టాయిలెట్స్ వినియోగించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. మధ్యాహ్న భోజనం చేశాక చేతులు, ప్లేట్లు కడుగుకునేందుకు పాఠశాలలో నీళ్లు లేవని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి పాఠశాలకు పలు గ్రాంట్స్ కింద నిధులు వచ్చినా పాఠశాల నిర్వహణకు వాటిని వినియోగించడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కరెంట్ సరఫరా లేనందున పాఠశాలలో నీటి సమస్య తలెత్తిందని వివరించారు. ఇకపై విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తానని ఆమె హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెళ్లిపోయారు.

డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన

తూప్రాన్: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కొత్త విధానాలు తీసుకురావడం కారణంగా ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని డాక్యుమెంట్ రైటర్లు శనివారం ఆందోళన చేశారు. వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తమ దుకాణాలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు డాక్యుమెంట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్లాట్ విధానాన్ని రద్దు చేయాలని, పాత విధానాన్ని కొనసాగించాలని కోరుతూ తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ రాజ్ కుమార్‌కు డాక్యుమెంట్ రైటర్లు వినతిపత్రం అందజేశారు. డిగ్రీలు, పీజీలు చేసి ఉద్యోగాలు లేక తమకు తాము స్వయం ఉపాధి పొందుతుంటే ప్రభుత్వం ఉపాధి కోల్పోయేలా నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదన్నారు. రాష్ట్రంలో ఈ విధానంతో 30 వేల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు ప్రశాంత్, అఫ్రోజ్, శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్, హరీశ్, అశ్విన్, రామకృష్ణ, అంకుష్, సతీష్ యాదవ్ పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

- చోద్యం చూస్తున్న అధికారులు
- వారి అండతోనే మట్టి దందా



హవేళిఘణాపూర్ శివారు కుంట నుంచి తరలిస్తున్న మట్టి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రం హవేళిఘణాపూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మట్టి దందా మూడుపువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా జోరుగా కొనసాగుతోంది. సామాన్యుడు ఒక ట్రాక్టర్ మట్టి కొట్టుకోవాలంటే అనుమతి అడిగే అధికారులు శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం సాయంత్రం వరకు హవేళిఘణాపూర్ శివారు మంగోనికుంట నుంచి మట్టి తరలిస్తున్నారు. రెండు రోజులుగా హైవే రోడ్డు పక్కనే నుంచి మట్టి తరలిస్తున్నా.. అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో రాత్రి వేళల్లో మట్టి కొడుతూ శ్మశాన వాటిక కమాన్‌ను ఢీకొట్టి మృతి చెందిన విషయం మరువకముందే అధికారులు ఇలా అక్రమ మట్టి దందాకు ప్రోత్సహిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సెలవు దినాల్లో..

అక్రమంగా మట్టి తరలిస్తున్న విషయంపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అనుమతి తీసుకున్నారని మాటను దాటవేస్తున్నారు. అందుకు సంబంధించిన పత్రాలుంటే చూపమని అడిగినా స్పందన లేదు. అధికారుల నుంచి అనుమతులుంటే పని దినాల్లో కాకుండా సెలవు దినాల్లో అక్రమ మట్టి తరలించడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై తహసీల్దార్ సింధూరేణుకాను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించక పోవడం గమనార్హం.

ప్రాణాలు పోయినా పట్టించుకోరా..?

గతంలో మెదక్ మండలం మంభోజిపల్లి గ్రామానికి చెందిన టిప్పర్ హవేళిఘణాపూర్ నుండి అక్రమంగా మట్టి తరలిస్తూ శ్మశాన వాటిక కమాన్‌ను ఢీకొట్టి డ్రైవర్ మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఈ విషయంపై స్థానిక సెక్రటరీ కూడా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరోక్షంగా ఆ రెండు శాఖల అధికారులు అక్రమ మట్టి దందాను ప్రోత్సహించడం వల్లే ఈ ప్రమాదంలో ఒకరు ప్రాణం బలిగొన్నారన్న ఆరోపణలున్నాయి. ఇంత జరుగుతున్నా కూడా అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రోగులకు అండగా సీఎంఆర్ఎఫ్

మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: రోగులకు అండగా సీఎంఆర్ఎఫ్ ఉందని ఎమ్మెలే రోహిత్‌రావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అంతకు ముందు కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ కింద కుట్టుమిషన్ శిక్షణ పొందిన మహిళా లబ్ధిదారులకు సర్టిఫికేట్లతో పాటు కుట్టుమిషన్‌లను అందజేశారు. పట్టణంలో రాందాస్ చౌరస్తాతో పాటు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు.

ఆలయాల కమిటీల అధ్యక్షులకు నోటీసులు

మెదక్ పట్టణంలోని రామాలయం, వెంకటేశ్వర ఆలయాల అధ్యక్షులకు దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ నోటీసులు అందించారు. ఆలయాలకు వచ్చే ఆదాయం, ఆలయాల పేర్లపై ఉన్న దుకాణాల అద్దెలు, డోనర్లు ఇస్తున్న డబ్బులకు లెక్కలు చెప్పాలని నోటీస్‌లో పేర్కొన్నారు. కాగా ఈ విషయంపై ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ.. కొందరు రాజకీయ నాయకుల స్వార్థం కోసం పట్టణంలోని ఆలయాలను ఎండో మెంట్ పరిధిలోకి రాకుండా చూస్తున్నారని, ఆలయాలపై వచ్చే ఆదాయం పక్కదారి పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పవన్, వెంకటరమణ, ఆంజనేయులు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మేడి మధుసూదన్ రావు, దొంతి లక్ష్మీముత్యం గౌడ్, రాగి అశోక్, దుర్గప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పిల్లికొట్యాలకు చెందిన భారతి సంఘం సభ్యురాలు మేకల సరోజన రూ. లక్ష స్త్రీ నిధి రుణం తీసుకున్నారు. ఆమె చనిపోయిన తర్వాత భర్తకు డెత్ క్లెయిమ్ వచ్చింది. శనివారం ఎమ్మెల్యే రోహిత్‌రావు మృతురాలి భర్త రవీందర్‌కు రూ. 82,000 వేల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు

నర్సాపూర్: మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని పలువురు కూలీలు ఆరోపించారు. తుజాల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఉపాధిహామీ పథకం ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్ మాణయ్య ఉపాధి పనులను నమోదు చేయడంలో అక్రమాలకు పాల్పడుతున్నారని కూలీలు ఆరోపించారు. గ్రామంలో చేపడుతున్న ఉపాధి పథకం పనులు పరిశీలించేందుకు శనివారం వచ్చిన ఇన్‌చార్జి ఫీల్డ్ అసిస్టెంట్ మాణయ్యను కూలీలు నిలదీస్తూ పలు ఆరోపణలు చేశారు. జాబ్ కార్డు కల్గిన పలువురు కూలీలు కూలీ పనికి రాకపోయినా.. వారి పేర్లు పనులకు వచ్చినట్లు రికార్డుల్లో రాస్తూ వారికి పథకం నుంచి కూలీ సొమ్ము వచ్చేలా చేస్తూ ఉపాధి పథకం నిధులను కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ కలిసి కాజేస్తున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన ఐదుగురు కూలీలు పనికి రాకపోయినా.. చాలా రోజులుగా వారి పేర్లు పనికి హాజరవుతున్నట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారని, వారి పేరున వచ్చే కూలీ సొమ్మును చాలా రోజులుగా కాజేస్తున్నారని కూలీలు ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కూలీలు డిమాండ్ చేశారు. ఈవిషయమై స్థానిక ఎంపీడీఓ మధులతను వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పెద్దశంకరంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేట, రామోజిపల్లి, వీరోజిపల్లి, కొత్తపేట, జూకల్ గ్రామాలలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. దీంతో పాటు ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.8లక్షల 22 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి, ఏఈఓలు, మమత, అఖిల్, వినీల్, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధ సంజీవరెడ్డి, ఐకేపీ ఏపీఎం గోపాల్, సీఈఓ రవీందర్, సీనియర్ నాయకులు నారాగౌడ్, రాజు, ఆర్ఎన్. సంతోష్, గంగారెడ్డి, సంగమేశ్వర్, సుభాష్‌గౌడ్, కుంట్ల రాములు, శ్రీను, పెరుమాండ్లగౌడ్, చందర్, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిర్జాపల్లిలో ..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ ఏపీఓ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మనోజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ తులసీరామ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప, నాయకులు పాపయ్య, భాస్కర్, రవి, మజాహర్, సిద్ధయ్య, అశోక్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సీసీ కృష్ణవేణి అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని పర్కిబండ గ్రామ పంచాయతీ వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. కార్యకక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, గ్రామ నాయకులు శ్రీరాం, నర్సింలు, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీరాములు, కుమార్, ఎం. ఆంజనేయులు, సత్తయ్య రాములు, బుచ్చయ్య, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నర్సాపూర్: రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాల్గవ మహాసభల వాల్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నందం ఆధ్వర్యంలో పలువురు కార్మికులు ఆవిష్కరించారు. నాల్గవ మహాసభలు ఈనెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో జరుగుతాయని, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

22లోగా దరఖాస్తు ఫారం అందజేయాలి

అల్లాదుర్గం(మెదక్): రాజీవ్ యువ వికాస్ ఉపాధి కల్పన కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఫారాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 22 లోగా అందజేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం స్థానిక విలేకర్లతో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరు మాన్యువల్ ఫారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇస్తేనే వారు రాజీవ్ యువ వికాస్‌కు అర్హులవుతారని చెప్పారు.

అజ్జమర్రి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): విధుల్లో నిర్లక్ష్యం వహించిన మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ అతినారం శంకరయ్యను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశానని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండల ప్రజా పరిషత్‌లో నిర్వహించిన నాలుగు సమావేశాలకు శంకరయ్య హాజరు కాలేదని, గ్రామంలో వంద మందికి పైగా ఉపాధి పనులు కల్పించాలని ఆదేశాలిచ్చినప్పటికీ, అతను నిర్లక్ష్యం వహిస్తూనే ఉన్నాడన్నారు. ఈ నెల 17న కేవలం 8 మంది కూలీలతో పనులు చేయించి, అధికారులు ఆదేశాలను బేఖాతరు చేశాడన్నారు. శంకరయ్యను సస్పెన్షన్ చేసిన విషయాన్ని ఉన్నతాధికారుల తెలియజేశామన్నారు. కాగా అజ్జమర్రి ఉపాధి పనులను పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి పర్యవేక్షిస్తుందన్నారు.

సన్మానం

శివ్వంపేట(నర్సాపూర్): ఉద్యోగ సమయంలో విద్యార్థులకు అందించిన విద్యాబోధన జీవితకాలం గుర్తుండి పోతుందని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శివ్వంపేట ఉన్నతపాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు నర్సింహాశర్మ పదవి విరమణ సందర్భంగా శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ప్రతీ ఉపాధ్యాయుడు అంకిత భావంతో విధులు నిర్వహిస్తే విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, హెచ్‌ఎం బాలచంద్రం, మండలంలోని ఉపాధ్యాయులు, స్నేహితులు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శోభ



కంచన్‌పల్లిలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శోభ, ఏడీఏ

కౌడిపల్లి(నర్సాపూర్): వరి పంటలో నారుమడి నుంచి సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల పంట నష్టాన్ని నివారించి అధిక దిగుబడి పొందొచ్చని నత్నయపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శోభ తెలిపారు. శనివారం మండలంలోని కంచన్‌పల్లిలో ఆర్ఈఏసీ సభ్యురాలు నాయిని లక్ష్మి వరి పంటను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ యూనివర్సిటీ నూతన విత్తనాలు కేఎన్ఎం 12368, డబ్ల్యూజీఎస్ 1537 మినికిట్స్ సాగు చేసినట్లు తెలిపారు. చీడపీడలను తట్టుకొని మంచి దిగుబడి రానున్నట్లు తెలిపారు. రైతులు నారు మడి నుంచి సస్యరక్షణ చర్యలు తీసుకోవడంవల్ల మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. వరి కోతలు అయ్యాక రైతులు పొలంలోని కొయ్యలను కాల్చొద్దని కలియదున్నాలన్నారు. వరికొయ్యలు కల్చడం వల్ల భూసారం తగ్గడంతో పాటు పంటకు నష్టం జరుగుతుందన్నారు. రైతులు ఈసందర్భంగా ప్రొ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆర్ఈఏసీ (రిసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కౌన్సిల్) సభ్యురాలిగా ఎంపికైన నాయిని లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పుణ్యవతి, ఏఈఓ సాహిత, ఆత్మ బీటీఎం నరేందర్ ఆదర్శరైతు రామకృష్ణాగౌడ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా రెపరెపలాడాలి

వెల్దుర్తి(తూప్రాన్): గల్లీ, గల్లీలో బీజేపీ జేండా రెపరెపలాడటమే తమ లక్ష్యమని బీజేపీ మండలాధ్యక్షుడు పడిగే దాసు అన్నారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పలు బస్తీల్లో పర్యటించి దేశంలో బీజేపీ చేపట్టిన ప్రజాసంక్షేమాన్ని వివరించారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపీటీసీ శివరాములుయాదవ్, మండల ఉపాధ్యక్షుడు బాలకిషన్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, నాగరాజు, నర్సింలు, శ్రీధర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **క్రీడా సామగ్రి అందజేత**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని క్రీడాకారులకు షటిల్ కాక్ బ్యాట్‌లతో పాటు క్రీడా సామగ్రిని వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతి అందజేశారు. కార్యక్రమంలో టేలర్ శ్రీను, కృష్ణ, సిద్ధిరాములు, సతీష్, విష్ణుతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ **పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు**

చేగుంట(తూప్రాన్): పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పడవల తయారీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ వర్మ అన్నారు. చేగుంట ప్రభుత్వ పాలిటెక్నిక్ 11వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్‌వర్మ మాట్లాడారు.అనంతరం కళాశాల అభివృద్ధి ప్రగతి నివేదిక కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చక్రవర్తి కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **తొలగిపోయిన షెడ్డు**

శివ్వంపేట(నర్సాపూర్): ఈదురు గాలులతో పశువుల పాకపై కప్పు తొలగిపోయింది. మండల పరిధిలోని కొత్తపేటలో శుక్రవారం వచ్చిన ఈదురు గాలులతో గ్రామానికి చెందిన సత్యనారాయణ వ్యవసాయ పొలం వద్ద నిర్మించిన పశువుల పాకపై కప్పు రేకులు తొలగిపోయి పొలాల్లో పడ్డాయి.

◆ **కంప్యూటర్ బహూకరణ**

నిజాంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి తాను చదివిన స్కూలుకు కంప్యూటర్ బహూకరించారు. మండలంలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న గ్రామానికి చెందిన జెల్ల శ్రీకాంత్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. దీంతో ఆయన శనివారం స్కూలుకు హెచ్‌ఎం పద్మారెడ్డికి కంప్యూటర్ అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **హాస్టల్ వార్డెన్ విధుల నుంచి తొలగింపు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ వార్డెన్‌ను విధుల నుంచి తొలగిస్తూ డీఎస్‌సీడీఓ శశికళ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 13న హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ అయి 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా చికిత్స అనంతరం ప్రస్తుతం విద్యార్థులు కోలుకున్నారు. కాగా ఈవిషయమై కలెక్టర్ ఆదేశాలతో అధికారులు విచారణ చేపట్టారు. దీంతో వార్డన్ నర్సమ్మతో పాటు వంటమనిషి భారతమ్మ నిర్లక్ష్యంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తేలడంతో వార్డెన్‌ను విధుల నుంచి తొలగించి, ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న వంటమనిషిని వేరే హాస్టల్‌కు మార్చినట్లు డీఎస్‌సీడీఓ శశికళ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ **ఎంజేపీలో బ్యాగ్‌లాగ్ పోస్టుల భర్తీకి పరీక్ష**

హవేళిఘణాపూర్(మెదక్): ఎంజేపీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం 6, 7, 8, 9 తరగతి విద్యార్థులకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎంజేపీ ప్రిన్సిపాపాల్ విజయనిర్మల తెలిపారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

◆ **ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం**

రేగోడ్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గణపతి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాలను శనివారం నిర్వహించారు. వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ దంపతులు శ్రీధర్ గుప్తా, అపర్ణ ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి వినోద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, పశువు ఆరోగ్యంగా, బలంగా తయారవుతుందని వెటర్నరీ సర్జన్ డాక్టర్ వినోద్ అన్నారు. శనివారం ఆయన సిబ్బందితో మండలంలోని చండూర్, గుజిరి తండాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది గట్టయ్య, శంకర్, రైతులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో శనివారం గాలికుంటు వ్యాధి నిర్ధారణ రక్త మూలాలు సేకరించినట్లు మండల వైద్యాధికారి సౌమ్యరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏడీ పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఒక్కసారి టీకా వేస్తే, ఆరు నెలల వరకు చర్మంలో ఉంటుందని చెప్పారు. . కార్యక్రమంలో ల్యాబ్ అసిస్టెంట్ భూపాల్‌గౌడ్, ప్రవీణ్, రాకేష్, శివాజీ, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు.. తీరనున్న ఇబ్బందులు



చెరువు కట్టపై రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మాజీ జెడ్పీటీసీ మహేశ్ గుప్తా తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టడం ద్వారా ప్రజల ఇబ్బందులు తొలగిపోనున్నాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రం శివ్వంపేట పెద్ద చెరువు కట్టపై బీటీరోడ్డు పాడై పోవడంతో మహేష్‌గుప్తా సొంత నిధులతో శనివారం మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుంతల రోడ్డుతో గిరిజన తండాలు, పిల్లుట్ల, లింగోజిగూడ, రత్నపూర్, కొత్తపేట, అల్లీపూర్‌తో పాటు వివిధ గ్రామాలకు వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మరమ్మతుల వల్ల ఇబ్బందులు తీరనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, లక్ష్మీనర్సయ్య, శేఖర్‌గౌడ్, కొండల్, నవీన్, రాములుగౌడ్, త్రినేష్‌గౌడ్, కేశ్యనాయక్, గోవింద్‌నాయక్, గొండస్వామి, తదితరులు ఉన్నారు.

ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి



చెన్నాపూర్ ధాన్యం తూకం పరిశీస్తున్న పీడీ

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిధి చెన్నాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే లారీల్లో లోడింగ్ చేసి రైస్ మిల్స్‌కు తరలించాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టేందుకు రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేయకూడదని సూచించారు. వీటితో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున రైతులు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, సిబ్బంది రత్నమ్మ, సరిత, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం

రేగోడ్(మెదక్): మండలంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన గణపతి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ దంపతులు శ్రీధర్‌గుప్తా, అపర్ణ ఆలయంలో హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అందమైన చేతిరాత నేర్చుకోవాలి



విద్యార్థులకు చేతిరాతపై అవగాహన కల్పిస్తున్న అహ్మద్

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ విద్యార్థి అందమైన చేతిరాతను నేర్చుకోవాలని మెంటరింగ్ ఎమినెంట్ ఎక్స్‌పర్ట్ ఎజాస్ అహ్మద్ అన్నారు. శనివారం పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపికైన స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందమైన చేతిరాత ఏవిధంగా రాయాలో అవగాహన కల్పించారు. చిన్నపాటి టెక్నిక్ ద్వారా చేతిరాత ఏ విధంగా ఉంటుందో అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి కష్టపడి చదవాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం, సిబ్బంది సిద్ధిరాములు, నాగవేణి, అశ్విని, రాధిక, రాణి, శోభారాణి ఉన్నారు.